ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న శ్రీనివాస్‌రెడ్డి, లచ్చిరెడ్డి

వనస్థలిపురం: భారతదేశ సైనికులకు శక్తి ఇవ్వాలని, నరేంద్రమోదీ నేతృత్వంలో దేశం అన్ని రంగాలలో విజయం సాధించాలని కోరుతూ బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం శ్రీపురం కాలనీలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పద్మారెడ్డి, దామోదర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, పదీప్ రెడ్డి, శంకరయ్యగౌడ్, శ్రీధర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, భిక్షపతి పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌కు మద్దతు



జాతీయ జెండాలతో దోసపాటి రాము

మన్సూరాబాద్: భారత సైన్యం చేపడుతున్న ఆపరేషన్ సిందూర్‌కు మద్దతు తెలుపుతున్నామని సామాజిక కార్యకర్త, రైస్ ఏటీఎం నిర్వాహకుడు దోసపాటి రాము తెలిపారు. నాగోలు డివిజన్ పరిధి రాక్‌హిల్స్‌కాలనీలోని రైస్ ఏటీఎం వద్ద శనివారం ఆయన మాట్లాడుతూ.. భారత్ ఎప్పుడు యుద్ధం కోరుకోదని, ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించే మహాకార్యానికి ఆపరేషన్ సిందూర్‌ను ప్రారంభించారన్నారు. కుల, మత, ప్రాంత భేదాలు లేకుండా దేశ ప్రజలందరూ ఆపరేషన్ సిందూర్‌కు మద్దతు పలుకుతున్నారని తెలిపారు.

ఆహ్లాదం పంచుతూ.. ఆరోగ్యం కాపాడుతూ..

నగరంలో ఎక్కడ చూసినా బహుళ అంతస్తుల నిర్మాణాలతో కాంక్రీట్ జంగిల్‌గా మారిపోయింది. పచ్చదనంతో కళకళాడిన ప్రాంతాల్లో కూడా నిర్మాణాలు బాగా పెరిగాయి. దీంతో ఒత్తిడి జీవితంలో నగర జీవికి సేద తీరేందుకు పార్కులు ప్రత్యామ్నాయంగా మారాయి అంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా మలక్‌పేట సర్కిల్–6 పరిధిలో 58 పార్కులు ఉన్నాయి. అయితే మొన్నటి వరకు కాసేపు సరదగా గడిపేందుకు ఉపయోగపడిన పార్కులు తాజాగా ఆరోగ్యాన్ని పెంచేందుకు సాధనాలుగా మారుతున్నాయి.

– మలక్‌పేట

ఓపెన్ జిమ్‌లకు ఆదరణ | వ్యాయామం, యోగాకు వేదికలుగా పార్కులు



ఓపెన్ జిమ్‌లో వ్యాయామం చేస్తున్న బాలబాలికలు

ఆసనాలు నేర్చుకుంటూ..

యోగాను ప్రపంచానికి పరిచయం చేసిన దేశం మనది. యోగాతో మానసిక, శారీరక ఆరోగ్యం చేకూరుతుంది. యోగా గురువులు తమకు తోచినంతలో ఉచితంగా యోగా నేర్పించేందుకు ముందుకొచ్చారు. యోగా శిక్షణ కోసం బయట గదులు అద్దే తీసుకోవాలంటే రూ. వేలల్లో చెల్లించాలి. ఆయా కాలనీవాసులు కోరిక మేరకు స్థానికంగా ఉన్న పార్కులను వేదికగా చేసుకుని ఆసనాలు నేర్పిస్తున్నారు. మూసాంబాగ్ డివిజన్ శాలివాహన పార్కులో యోగా శిక్షణ కొనసాగుతోంది. ఉదయం సాయంత్రం పదుల సంఖ్యలో కాలనీవాసులు యోగా చేస్తున్నారు.

నిత్యం వ్యాయామం..

నియోజకవర్గ పరిధిలోని పార్కులు అభివృద్ధి చేయడంలో కొత్త శోభ సంతరించుకున్నాయి. దీంతో ఆయా కాలనీల్లోని పార్కులకు సందర్శకుల తాకిడి పెరిగింది. గతంలో పార్కుల్లో కేవలం వాకింగ్ పాత్‌తో పాటు బెంచీలు, కొన్ని ఆట పరికరాలు మాత్రమే ఉండేవి. అవీ కూడా వినియోగించలేని దుస్థితిలో కనిపించేవి. జీహెచ్‌ఎంసీ అధికారులు సలీంనగర్ పార్కులో ఓపెన్ జిమ్, తేజ్‌నగర్ పార్కు, ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీలో జిమ్ ఏర్పాటు చేశారు. ఉదయం, సాయంత్రం యువకులు, పిల్లలు, పెద్దలు, మహిళలు కాలనీవాసులు కసరత్తు చేస్తూ బిజీగా కన్పిస్తున్నారు. ఉదయం 5.30 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు పార్కులు సందర్శకులతో సందడిగా కన్పిస్తున్నాయి.



ఎస్‌బీఐ ఆఫీసర్స్ కాలనీ పార్కు జిమ్‌లో వ్యాయామం చేస్తున్న యువకులు



సలీంనగర్ పార్కులో ఓపెన్ జిమ్‌లో

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.13, వంకాయ రూ.18, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.08, క్యారెట్ రూ.24, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.26, ఉల్లిగడ్డ రూ.18, గోకరకాయ రూ.40, దోసకాయ రూ.23, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.35, మునగ రూ.50, కందగడ్డ రూ.75, బీట్‌రూట్ రూ.23, కీర రూ.35, బీన్స్ రూ.145, క్యాప్సికమ్ రూ.45. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.





సైనికులకు అండగా ఉండాలి




కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: ప్రతీ భారతీయుడు సైనికులకు అండగా నిలవాలని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. శనివారం రాత్రి భారత్–పాకిస్తాన్ సరిహద్దుల్లో జరుగుతున్న యుద్ధ ఘర్షణలో వీరమరణం పొందిన భరత సైనికుడు ఎం మురళీనాయక్, సచిన్ యాదవ్‌కు గౌరవంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో సరూర్‌నగర్ మినీ ట్యాంక్ బండ్ ప్రాంతంలోని ప్రియదర్శినీ పార్కు నుంచి సరూర్‌నగర్ చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యుద్ధ భూమిలో ప్రాణత్యాగం చేసిన వీర జవానులకు ఘనంగా నివాళులు అర్పించి వారి కుంబాలకు తాను అండగా ఉంటానని స్పష్టం చేశారు.త్వరలో ఇండియన్ ఆర్మీకి తాను రూ. 3 లక్షలు విరాళంగా అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో లింగోజిగూడ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వరప్రసాద్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు తిలక్‌రావు పాల్గొన్నారు.

లోటస్ ల్యాప్‌లో బెస్ట్ ఎడ్యుకేషన్



హుడాకాంప్లెక్స్: లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ సరూర్‌నగర్ బ్రాంచ్‌లో పదో తరగతిలో విద్యార్థులు ఏటా మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తున్నారు. ఈసారి శ్రీజరెడ్డి 594 మార్కులతో రాష్ట్రంలో 3వ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా మంచి మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల సిబ్బంది అభినందించారు. అనంతరం స్కూల్ ఫౌండర్ చైర్మన్ కడారి చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. 25 సంవత్సరాల క్రితం స్థాపించిన తమ పాఠశాలలో విలువలతో కూడిన బోధన అందిస్తున్నామని తెలిపారు. ఉత్తమ మార్కులు సాధించిన శ్రీజరెడ్డితో పాటు ఉన్నతమైన మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సిబ్బందిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ కడారి మాధవి, చీఫ్ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ పద్మజారెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



రసాయనాలతో మగ్గించిన 7.5 టన్నుల మామిడి పండ్లు స్వాధీనం



రసాయన పదార్థాలతో పండించిన పండ్లు

మలక్‌పేట: రసాయనాలతో పండించిన 7.5 టన్నుల మామిడి పండ్లను సౌత్‌ఈస్ట్ టాస్క్ ఫోర్స్, మలక్‌పేట పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ వివరాల ప్రకారం.. మూసారంబాగ్ డివిజన్ పరిధి శాలివాహననగర్ పార్కు సమీపంలో రెండుచోట్లా, సలీంనగర్‌లో రసాయనాలతో మామిడి పండ్లు పండిస్తున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు శనివారం సదరు ఇళ్లలో తనిఖీ చేశారు. శాలివాహననగర్‌కు చెందిన సయ్యద్ వసీమ్ అక్రమ్(27), టీవీటవర్ ప్రాంత నివాసి మహమ్మద్ శేర్‌ఖాన్(48), సలీంనగర్‌కు చెందిన మహమ్మద్ అజీమ్‌ఖాన్(38) ఇథిలిన్ అనే రసాయన పదార్థంతో మామిడి పండ్లు పండిస్తున్నారు. ముగ్గురితో పాటు మామిడి పండ్లను జీహెచ్‌ఎంసీ సౌత్ జోన్ ఫుడ్‌సేఫ్టీ అథారిటీకి అప్పగించినట్లు తెలిపారు.

కూలుతున్న కోట.. మరమ్మతు ఎప్పుడంటా?

నిజాం కాలం నాటి పురాతన కోట మలక్‌పేట ప్రేమలతా కాలనీలో ఉంది. నిజాం నవాబ్ విడిది కోసం ఈ కోట నిర్మించినట్లు చరిత్ర. ఇక్కడ నవాబు తన కుటుంబ సభ్యులతో కలిసి గుర్రపు స్వారీ చేసేవారని, ఆయన భార్య పేరుపై ఈ కోట నిర్మించారు.దాదాపు 100 ఏళ్ల పైబడిన ఈ కోట వర్షాలకు సగం మేర కూలి నేలమట్టమైంది. కాలనీలో ఉండే చిన్నారులు ఈ కోటలో ఆడుకుంటుంటారు. త్వరలో రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని కోటకు మరమ్మతు లేదా అక్కడ ఎవరూ వెళ్లకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

చాదర్‌ఘాట్



